హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- మహాశివరాత్రి సందర్భంగా కిటకిటలాడిన శైవాలయాలు
- పలు ఆలయాల్లో ప్రముఖుల పూజలు
- హనుమకొండలో సాంస్కృతిక సమ్మేళనానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరు
- వేములవాడలో పూజలు చేసిన ఎమ్మెల్సీ కవిత

నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా శైవాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివలింగాలను దర్శించుకొని భక్తులు పరవశించిపోయారు. పలు దేవాలయాల్లో ప్రముఖులు పూజలు చేశారు. హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో బుధవారం రాత్రి ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరయ్యారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ రాకేశ్ రెడ్డి ఉన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామిని మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబసభ్యులు పూజలు, అభిషేకం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఆలయ పరిధిలో మొక్కలు నాటారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీశైలంలో శివస్వాములు, భక్తులతో ఆలయం కిక్కిరిసింది. బుగ్గరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం సుమారు ఐదు కిలోమీటర్ల మేర భక్తులు క్యూకట్టారు.

పండుగపూట విషాదం

- వేర్వేరుచోట్ల 8 మంది మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ)/కోటపల్లి/ఓదెల : మహాశివరాత్రి పర్వదినం పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది పుణ్యస్నానాలకు వెళ్లి మృత్యువాతపడ్డారు. ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తాడిపూడిలోని గోదావరిలో పుణ్యస్నానానికి వెళ్లిన ఐదుగురు విద్యార్థులు చనిపోయారు. బుధవారం తెల్లవారుజామున 11మంది స్నేహితులు కలిసి గోదావరిలో స్నానానికి వెళ్లారు. ఈక్రమంలో నదిలోతు తెలియకపోవడంతో ఐదుగురు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పడాల దుర్గాప్రసాద్(19), పడాల సాయి(19), తిరుమలశెట్టి పవన్(17), ఏ పవన్(19), జీ ఆకాశ్(19)ఉన్నారు. శ్రీశైలం పాతాళగంగలో పుణ్యస్నానానికి వెళ్లిన తండ్రీకొడుకు మృతిచెందారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన వీరి మృతి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారుపల్లికి చెందిన రాదండి రాజేశ్ (50) గోదావరిలో గల్లంతయ్యాడు. శివరాత్రి సందర్భంగా అమ్మవార్ల విగ్రహాలను గోదావరికి తీసుకెళ్తుండగా రాజేశ్ వెళ్లాడు. ఎర్రాయిపేటలో స్నానం కోసం గోదావరిలోకి వెళ్లి గల్లంతయ్యాడు. పెద్దపల్లి జిల్లా ఓదెలలోని మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చిన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరుకు చెందిన ఒరుసు శ్రీనివాస్ గుండెపోటుకు గురవగా విధుల్లో ఉన్న ఎస్ఐ రమేశ్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు.



విద్యుద్దీపాలంకరణలో కాంతులీనుతున్న వేములవాడ రాజరాజేశ్వరాలయం

మంథని : గోదావరిలో నీళ్లు లేకపోవడంతో స్నానాలు చేసేందుకు ఇసుకలో నడుచుకుంటూ అవతలి వైపునకు వెళ్తున్న భక్తులు

మహాశివరాత్రి ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం

- గోదావరిలో నీళ్లు లేక భక్తుల అవస్థలు .. తీవ్ర ఆగ్రహం
- వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాట్లు అధ్వానం
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి ఫైర్

వేములవాడ టౌన్/మంథని/కురవి, ఫిబ్రవరి 26 : శివరాత్రి పర్వదినం ఏర్పాట్లలో అధికారులు విఫలం కావడంతో భక్తులు నరకం చూశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో భక్తులకు సరిపడా ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేయకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వేములవాడ రాజన్న ఆలయానికి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సుమారు 2.50 లక్షల మంది తరలివచ్చారు. కోడెమొక్కు తీర్చుకునేందుకు గంటలతరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. అధికారులు కేవలం వీఐపీల సేవలోనే తరించడంతో భక్తులు ఫైర్ అయ్యారు. మంథని గోదావరి తీరంలో పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు నదిలో నీళ్లులేక తీవ్ర ఇబ్బందిపడ్డారు. గోదావరి తీరంలో రాళ్లను దాటుకుంటూ ఇసుకదిబ్బల్లో దాదాపు కిలోమీటర్‌కు పైగా నడిచి పుణ్యస్నానాలు ఆచరించారు. వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుతో మంథని గోదావరి తీరం నిత్యం నిండుకుండలా దర్శనమిచ్చేది. ఏ పండుగ వచ్చినా భక్తులు మెట్ల వద్దే సంబురంగా పుణ్యస్నానాలు ఆచరించే వారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అందుకు భిన్నంగా నేడు గోదావరి రాళ్లు, ఇసుక దిబ్బలతో దర్శనమిస్తుండడంతో భక్తులు స్నానాలకు ఇబ్బందిపడ్డారు. 'గోదావరి నదిలో స్నానం చేద్దామని వస్తే నీళ్లు లేకపాయె. స్నానం కోసం గోదావరి శివారుకు నడుచుకుంటూ పోయినం. ఇసుకలో నడుచుకుంటూ పోతే ప్రాణం పోయినట్టు అనిపించింది. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు నీళ్లకు గోస లేకుండె. ఎప్పుడూ నీళ్లుండె. ఏ పండుగ వచ్చినా ఇక్కడికి వచ్చి స్నానం చేసి పోయేటోళ్లం. ఇప్పుడు స్నానానికి రావాలంటే నీళ్లు లేక ఇబ్బందిపడాల్సి వస్తుంది' అని మంథని మండలం ధర్మారానికి చెందిన ధర్మక్క వాపోయారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చేసిన ఏర్పాట్లు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఆయన సతీసమేతంగా హాజరయ్యారు. వీఐపీ క్యూలైన్ నుంచి లోపలికి వచ్చే సమయంలో ఎంతకీ కదలకపోవడంతో అసహనానికి గురయ్యారు. ఆలయ ఈవో సత్యనారాయణపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్రమత్తమైన అధికారులు ఎమ్మెల్సీ దంపతులను మరో గేటు గుండా స్వామివారి దర్శనం చేయించారు.

మహబూబాబాద్ జిల్లా కురవి వీరభద్ర ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

కరీంనగర్‌లో 773, నల్లగొండలో 200 పోలింగ్ కేంద్రాలు

హైదరాబాద్/కరీంనగర్/నల్లగొండ ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మూడు నియోజకవర్గాలలో మొత్తం 75 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-అదిలాబాద్‌లో పట్టభద్రుల నియోజకవర్గంలో 3,55,159 ఓటర్లు ఉండగా 56 అభ్యర్థులు బరిలో ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానం కోసం 27,088 మంది ఉపాధ్యాయులు ఓట్లు నమోదు చేసుకోగా 15 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఆ నాలుగు జిల్లాల పరిధిలో అధికారులు 773 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉపాధ్యాయ స్థానానికి కూడా ఇవాళ పోలింగ్ జరగనుంది. ఇక్కడ 25,797 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈ స్థానం నుంచి 19మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అధికారులు 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేశారు. మొత్తం ఉమ్మడి ఏడు జిల్లాల పరిధిలో జరిగే ఎన్నికల పోలింగ్ కోసం ఆయా జిల్లాల కలెక్టర్లు ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం సాయంత్రమే ఆయా జిల్లా కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సిబ్బంది సామగ్రితో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

21 లక్షల విలువైన మద్యం పట్టివేత

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా నిల్వ ఉంచిన రూ.21లక్షల విలువైన మద్యాన్ని మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గూడెంలో పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం బుధవారం చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడించారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గూడెం సమీపంలోని వైస్‌షాప్ దగ్గర కౌటాల సీఐ రమేశ్, ఎస్ఐలు ప్రవీణ్, మధుకర్, నరేశ్ తనిఖీ చేశారు. పక్కనే రూములో నిల్వ ఉంచిన మద్యం కాటన్లు గుర్తించారు. 3 బెల్ట్ షాపులు తనిఖీ చేయగా మద్యం లభించింది. 700 కాటన్ల మద్యం, బీరు సీసాలు పట్టుబడ్డాయి. వీటి విలువ 21,50,890 ఉంటుందని, సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ వెల్లడించారు.

ఒక్క ఓటు.. ఐదుగురు సిబ్బంది

పలిమెల, ఫిబ్రవరి 26 : మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జయశంకర్ జిల్లా పలిమెలలో మొదటి సారి పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓటర్లు 38 మంది ఉండగా టీచర్ ఎమ్మెల్సీకి ఒక ఓటరు మాత్రమే ఉన్నారు. ఒక్క ఓటరు కోసం బూత్ ఏర్పాటు చేయడమే కాకుండా ఐదుగురు సిబ్బందిని నియమించారు.

భూపాలపల్లి జిల్లా పలిమెలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

'ఆత్మీయ భరోసా' నిధుల విడుదల

- 66,240 మంది కూలీల ఖాతాల్లోకి రూ.39.74కోట్లు
- ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో నేజమ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఉపాధి హామీ కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' నిధులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. జనవరి 26న ఈ పథకం ప్రారంభం కాగా, ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపికచేసి గ్రామసభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో నిధులు జమచేసింది. తొలుత 18,180 మందికి 6 వేల చొప్పున జమచేయగా, తర్వాత శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో పథకం నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని మంత్రి సీతక్క ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని 66,240 మంది కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లను ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) పద్ధతిలో జమచేసింది. మొత్తం 83,420 మంది కూలీల అకౌంట్లలో రూ.50.65 కోట్లు జమ అయ్యాయి.

ఉద్యోగులకు సర్కారు బాకీ 10 వేల కోట్లు!

మొదటిపేజీ తరువాయి...

కూడా చెల్లించడంలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 3.6 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. వీరంతా పెండింగ్ బిల్లుల బాధితులే. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జిల్లా పరిషత్ టీచర్ల జీపీఎఫ్ రూపాయి కూడా విడుదల కాలేదు. గతంలో పెండింగ్ బిల్లులను ట్రెజరీలో సమర్పించిన 24 గంటల్లోనే ఆ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేది. కానీ, ఇప్పుడు కండ్లు కాయలు కాసేలా వేచిచూడాల్సి వస్తున్నది.

పెండింగ్‌లో పెట్టి.. ఆపై తిరస్కరించి..

ఉద్యోగుల బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడమే కాకుండా మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియగానే వాటిని తిరస్కరిస్తున్నది. దీంతో ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కొన్ని బిల్లులను ఏండ్ల తరబడి ట్రెజరీల్లో పెండింగ్‌లో పెట్టి, ఏడాది తర్వాత మళ్లీ రీవ్యాలిడేషన్ చేయించుకురమ్మంటున్నారు. దీంతో అసలే బిల్లులు రాక అవస్థలు పడుతున్న ఉద్యోగులు రీవ్యాలిడేషన్‌తోపాటు కొత్త ప్రాసీడింగ్ కోసం మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. అయినప్పటికీ 'గతంలోనే ఇచ్చాం కదా.. ఇప్పుడు మళ్లీ ఏమిటి?' అంటూ అధికారులు చిర్రుబుర్రులాడుతున్నారు. ఓ టీచర్ ఈఎల్ సరెండర్ బిల్లులు సమర్పించగా ఇంతవరకు మంజూరుకాలేదు. ఆర్థిక సంవత్సరం 2024 మార్చిలో ముగియడంతో కొత్త బిల్లు రీసబ్మిట్ చేయాలని సూచించారు. కొత్త బిల్లు సమర్పించిన తర్వాత కూడా పెండింగ్‌లోనే పెట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) వచ్చే నెలాఖరుతో ముగియనున్నది. అప్పటిలోగా ఈ బిల్లు మంజూరు కాకపోతే దాని గడువు ముగిసినట్టే. ఆ బిల్లు కోసం మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీంతో సర్కారు తప్పిదాలకు ఉద్యోగులను బలిచేయడం ఎంతవరకు సబబు అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఉద్యోగుల ఆగ్రహం

పెండింగ్ బిల్లులు మంజూరు కాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. పాత బిల్లుల గడువు ముగియడంతో మళ్లీ కొత్తగా బిల్లులు సమర్పించాల్సి రావడం, కొన్ని శాఖల్లో రీవ్యాలిడేషన్ చేయించాలనడం చిన్న ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడంతో ఉద్యోగ సంఘాల నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్చి 12 తర్వాత పోరుబాట పట్టేందుకు ఉద్యోగ సంఘాల జేఏసీ సిద్ధమవుతున్నది.

ఉద్యోగుల అగచాట్లు ఇవీ..

- ఓ ఉద్యోగి 2023 ఫిబ్రవరి 8న సమర్పించిన 30 రోజుల సరెండర్ లీవుల బిల్లు రూ.1,03,864 మొత్తానికి ఆ ఏడాది మార్చి 31న ఓసారి, నిరుడు మార్చి 31న మరోసారి రీటోకెన్ అయ్యింది. కానీ, ఇప్పటివరకు ఆ బిల్లు జారీకాలేదు. ఇప్పుడు 2025 మార్చి 31 సమీపిస్తున్నప్పటికీ ఆ బిల్లు పెండింగ్‌లో ఉన్నది. అంటే.. కనీసం లక్ష రూపాయల బిల్లును కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేక రెండేండ్లు పెండింగ్‌లో పెట్టింది.
- కరీంనగర్ జిల్లాకు చెందిన మరో ఉద్యోగి తన ఆర్జిత సెలవులను సరెండర్ చేయడంతో వచ్చే రూ.3 లక్షల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇంతవరకు ఆ బిల్లు మంజూరు కాలేదు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఓ ఉద్యోగి తన పిల్లల ఫీజులు చెల్లించేందుకు జీపీఎఫ్ నుంచి రూ.1.90 లక్షలు, లీవ్ సరెండర్ ద్వారా రూ.1.3 లక్షలు తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, ఏడాది దాటినా ఇంతవరకు ఆ బిల్లులు మంజూరు కాలేదు.
- ఉద్యోగుల రిటైర్మెంట్ వయో పరిమితిని ప్రభుత్వం 61 ఏండ్లకు పెంచింది. కానీ, ఓ ఉద్యోగి టీజీఎల్ఐ పాలసీలు 58 ఏండ్లకే మెచ్యూర్ అయినప్పటికీ ఆ మొత్తాన్ని ఇంతవరకు చెల్లించలేదు.

సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిపై తర్జన భర్జన!

- సామాజిక వర్గాలవారీగా పార్టీలో చర్చలు
- కాంగ్రెస్ నుంచి సీటుపై ఇంకా రాని స్పష్టత?

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికపై సీపీఐలో తర్జన భర్జన కొనసాగుతున్నది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నోటిఫికేషన్ మార్చి 3న వెల్లడయ్యే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు 4, బీఆర్ఎస్‌కు ఒక స్థానం దక్కే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల ముందు సీపీఐతో కుదిరిన ఒప్పందం మేరకు ఆ పార్టీకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామన్న హామీ ఉన్నది. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సీపీఐకి ఒక ఎమ్మెల్సీ స్థానమే కేటాయిస్తామని కాంగ్రెస్ సర్దిచెప్తున్నది. దీంతో కాంగ్రెస్ ఇస్తామన్న సీటుపై సీపీఐకి ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటివరకు రెండు పార్టీల మధ్య చర్చలు జరగలేదు. సామాజిక కోణంలో ఎమ్మెల్సీ అభ్యర్థిని ఆచితూచి ఎంపిక చేయాలని అంతర్గత చర్చ జరుగుతున్నది. ఒక్క సీటే అయినందున పార్టీ సీనియర్ నేత చాడ వెంకట్‌రెడ్డికి కేటాయిస్తారా? లేక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా వర్గాల్లో మరొకరికి కేటాయిస్తారా అనేది తేలాల్సి ఉన్నది. సీటు ఇచ్చే అంశంపై ముందుగా కాంగ్రెస్‌తో సీపీఐ చర్చించే అవకాశం ఉన్నది. ఆ తర్వాతే అభ్యర్థిని ఖరారు చేస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

కేఆర్ఎంబీ మీటింగ్‌కు ఏపీ డుమ్మా

- తేలని కృష్ణా నీటివాటాలు, నేడు భేటీ
- కోటాకు మించి ఆంధ్రప్రదేశ్ డిమాండ్
- ఏప్రిల్ వరకే 55 టీఎంసీలకు ఇండెంట్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) కీలక సమావేశానికి ఏపీ సర్కారు డుమ్మా కొట్టింది. దీంతో యాసంగి సాగు, వేసవి తాగునీటి వాటాల అంశం ఎటూ తేలకుండాపోయింది. ఏపీ గైర్హాజరుతో సమావేశాన్ని బోర్డు నేటికి వాయిదా వేసింది. ఏపీ సర్కారు తీరుపై తెలంగాణ అధికారులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నుంచి వినియోగించుకోవాల్సిన నీటి వాటాలను తేల్చేందుకు కేఆర్ఎంబీ 24న సమావేశాన్ని నిర్వహించింది. రెండు రిజర్వాయర్లలో కలిపి 64 టీఎంసీలే అందుబాటులో ఉండగా, ఇరు రాష్ట్రాల డిమాండ్లు రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. ఏపీ 33 టీఎంసీలు, తెలంగాణ 116 టీఎంసీలు కావాలని బోర్డుకు నివేదించాయి. దీంతో బోర్డు చేతులెత్తేసింది. రాష్ట్రాల నీటివాటాలను తేల్చుకోవాలని చేతులు దులుపుకుంది. అందుకు సీఈల స్థాయిలో కమిటీ వేసింది. ప్రత్యేకంగా సమావేశమై అందులో చర్చించుకుని రావాలని సూచించింది. అనంతరం బుధవారం మరోసారి భేటీ అవుదామని వెల్లడింది. బోర్డు సూచన మేరకు సీఈలు సమావేశమయ్యారు. ఈ క్రమంలో బుధవారం జలసౌధలో మధ్యాహ్నం బోర్డు మీటింగ్ నిర్వహించేందుకు కేఆర్ఎంబీ సమాయత్తమైంది. ఈ సమావేశానికి తెలంగాణ ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్‌కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు. అయితే ఏపీ అధికారులు మాత్రం సమావేశానికి గైర్హాజరయ్యారు. మీటింగ్ మొదలయ్యే సమయానికి రావట్లేదని సమాచారమిచ్చారు. ఆన్‌లైన్‌లో నైనా హాజరుకావాలని బోర్డు అవకాశం కల్పించినా ఏపీ అధికారులు వినిపించుకోలేదు. శివరాత్రి పండుగ కాబట్టి మీటింగ్‌లో పాల్గొనలేమని చెప్పారు. ఏపీ అధికారుల తీరుపై తెలంగాణ అధికారులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. బోర్డు ఆదేశాలకే విలువివ్వకపోతే ఎలా అని చైర్మన్ అతుల్‌జైన్ ఎదుట ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, ఈఎన్సీ అనిల్‌కుమార్ అసంతృప్తి వ్యక్తంచేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని తరలించకుండా ఏపీని నిలువరించాలని బోర్డుకు తేల్చిచెప్పారు. అదేవిధంగా సాగర్ కుడి కాల్వ నుంచి 7 వేల క్యూసెక్కులు కాకుండా కేవలం 5వేల క్యూసెక్కులకే ఏపీని పరిమితం చేయాలని తెలిపారు. సీఈల మీటింగ్‌కు సంబంధించిన వివరాలను బోర్డుకు నివేదించారు. రెండు ప్రాజెక్టుల నుంచి తెలంగాణకు ఏప్రిల్ వరకే 63 టీఎంసీలు కావాలని, ఆ మేరకు జలాలను ఇవ్వాల్సిందేనని వెల్లడించింది. ఏపీ కోటాలో ప్రస్తుతం 25 టీఎంసీలే ఉన్నా కూడా 55 టీఎంసీలు కావాలంటూ డిమాండ్ చేయడంపై అభ్యంతరం వ్యక్తంచేసింది. అనంతరం బోర్డు సమావేశాన్ని నేటి ఉదయానికి చైర్మన్ వాయిదా వేశారు.

హెచ్ఐవీతో ఆగిన వరుడి పెండ్లి

- అధికారుల రంగప్రవేశంతో చివరిక్షణంలో రద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): హెచ్ఐవీ ఉన్న విషయాన్ని దాచి ఓ యువకుడు పెండ్లికి సిద్ధమయ్యాడు.. తీరా తాళికట్టే సమయానికి హెచ్ఐవీ ప్రాజెక్ట్ అధికారి రావడంతో పెళ్లిని నిలిపివేశారు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగింది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఓ యువకుడి (35)కి 2013లో హెచ్ఐవీ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. అప్పటి నుంచి మందులు వాడుతూ ఆరోగ్యంగానే ఉన్నాడు. ఈ క్రమంలో యువకుడు ఓ యువతితో పెండ్లికి సిద్ధమయ్యాడు. తాడేపల్లి క్రిస్టియన్ పేటలోని ఓ చర్చిలో రింగులు మార్చుకుని పెళ్లితంతు పూర్తవుతుందన్న సమయంలో అక్కడకు హెచ్ఐవీ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ శాంసన్ సిబ్బందితో వచ్చాడు. వరుడికి హెచ్ఐవీ ఉన్న విషయాన్ని వధువు కుటుంబ సభ్యులకు చెప్పగా.. వాళ్లు పెళ్లిని నిలిపివేశారు. వివాహం ఆగిపోవడంతో పెండ్లికొడుకు బంధువులు వధువు బంధువులతో గొడవకు దిగారు. దీంతో చర్చి ప్రతినిధులు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించివేశారు.

సినీనటుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్

కొండాపూర్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): కులం పేరుతో దూషిస్తూ, ప్రజల్లో వర్గవిభేదాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేశారని సినీనటుడు పోసాని కృష్ణమురళిపై ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు హైటెక్ సిటీలోని మైహోమ్‌భుజలో నివాసం ఉంటున్న పోసానిని బుధవారం ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆంధ్రాకు తరలించారు.